క్లుప్తంగా

పోలీసుల కవాతు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గోల్‌బంగ్లా నుంచి మామిడిపల్లి చౌరస్తా వరకు పోలీసులు కవాతు నిర్వహించారు.

అయ్యప్ప మాలధారణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో పలువురు భక్తులు ఆదివారం అయ్యప్ప దీక్ష తీసుకున్నారు. గురుస్వామి నగేశ్ శర్మ సమక్షంలో మాల వేసుకుని దీక్ష ప్రారంభించారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

స్థానికుల సహకారంతో అంత్యక్రియలు



రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామంలో యాచకురాలు మృతి చెందగా, ఎస్సై ఉదయ్‌కుమార్ స్థానికుల సహకారంతో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. బోధన్ పట్టణానికి చెందిన రావుల గంగారాంతోపాటు ఆయన కూతురు లక్ష్మి(18) భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతున్న లక్ష్మి ఆదివారం మృతిచెందింది. స్థానికుల ద్వార విషయం తెలుసుకున్న ఎస్సై ఉదయ్‌కుమార్ గ్రామానికి చేరుకుని మృతురాలి తండ్రి గంగారాంను విచారించారు. అంత్యక్రియలకు డబ్బులు లేవని చెప్పడంతో స్థానికుల సహకారంతో ఎస్సైతోపాటు డ్రైవర్ శేఖర్‌గౌడ్ మృతదేహాన్ని శ్మశానవాటిక వరకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవరం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



ఆర్మూర్: ప్రత్యేక విద్య కోసం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలకు పంపించే విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలని మెదక్ డయాసిస్ బిషప్ పద్మారావు సూచించారు. పట్టణంలోని సీఎస్‌ఐ చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. బధిర విద్యార్థులు బిషప్‌ను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శాంతమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిషప్ ప్రసంగించగా, ప్రత్యేక ఉపాధ్యాయులు సైన్ లాంగ్వేజ్ ద్వారా బధిర విద్యార్థులకు వివరించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మనోధైర్యాన్ని కల్పించేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. డయాసిస్ లే సెక్రటరీ ప్రభుకిరణ్, బధిర పాఠశాల మేనేజర్ సువర్ణ కిరీటి, పాస్టర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉపాధ్యాయులు రాజేశ్, దిలీప్, సుధా, శ్రీజ, రజిత, మాధవి, లక్ష్మి, నిర్మల, మణిధర్ పాల్గొన్నారు.

నగర ప్రజలకు అందుబాటులో ఉంటా



బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఓటమిపాలైన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ప్రజలకు అవసరమైన అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎల్లప్పుడూ నగర ప్రజలతోనే ఉంటానన్నారు.

ఇందూరులో కాషాయం రెపరెపలు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ విజయం
- కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీపై 15387 ఓట్ల మెజార్టీ
- మూడోస్థానానికి పరిమితమైన ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

సుభాష్‌నగర్: సార్వత్రిక ఎన్నికల్లో ఇందూరు గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడింది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ షబ్బీర్ అలీపై 15,387 ఓట్ల తేడాతో ధన్‌పాల్ గెలుపొందారు. ధన్‌పాల్ 75,240 ఓట్లతో మొదటిస్థానంలో, 59,853 ఓట్లతో షబ్బీర్ అలీ రెండోస్థానంలో నిలవగా, సిట్టింగ్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా 44,829 ఓట్లతో మూడోస్థానానికి పరిమితమయ్యారు. అర్బన్ నియోజకవర్గంలో 289 పోలింగ్ స్టేషన్లు ఉండగా, మొత్తం 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు.

మెజార్టీ రౌండ్లలో బీజేపీదే ఆధిక్యం..

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 21 రౌండ్లలో ఓట్లు లెక్కించగా, మెజార్టీ రౌండ్లలో బీజేపీ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బీఆర్‌ఎస్ కేవలం 9వ రౌండ్‌లోనే ఆధిక్యం సాధించగా, 8 రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యంలో నిలిచింది. 16వ రౌండ్ వరకు 32వేలపైచిలుకు ఓట్ల ఆధిక్యంలో బీజేపీ ఉండగా, 17, 18, 19, 20, 21 రౌండ్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యత వచ్చింది. చివరికి 15,387 ఓట్లతో ధన్‌పాల్ విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీ వాహ కొనసాగించింది. మొత్తం 2,869 ఓట్లకుగాను 2,514 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. అందులో బీజేపీ అభ్యర్థికి 1,516 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 749, బీఆర్‌ఎస్‌కు 231 ఓట్లు వచ్చాయి.



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

తొమ్మిదిన్నరేళ్ల తర్వాత..

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత బీజేపీ రెండోసారి జెండా ఎగురవేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీజేపీకి మొదటి నుంచి పట్టుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్లుగా డాక్టర్ భారతిరాణి, ముక్కా దేవేందర్ గుప్తా పనిచేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున యెండల లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందగా, తెలంగాణ ఉద్యమ సమయంలో 2010లో యెండల రాజీనామా చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండుసార్లు బీఆర్‌ఎస్ తరపున గణేశ్‌గుప్తా గెలుపొందారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు..

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ధన్‌పాల్ సూర్యనారాయణ భారీ మెజార్టీతో గెలుపొందడంతో పార్టీ శ్రేణుల సంబురాలు అంబరాన్నంటాయి. కౌంటింగ్ కేంద్రం వద్ద ధన్‌పాల్ ధ్రువీకరణ పత్రం అందుకున్న తర్వాత విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పార్టీ శ్రేణులు ర్యాలీలో రంగులు చల్లుకుని, టపాకాయలు కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర, జిల్లా నేతలు ధన్‌పాల్‌కు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ధన్‌పాల్ ఇంటి వద్ద, కార్యాలయంతోపాటు బీజేపీ కార్యాలయంలో సంబురాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య మిఠాయిలు పంచిపెట్టారు. వినాయక్‌నగర్‌లో హైందవసేవ, హిందువాహిణి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. అర్బన్‌లో బీజేపీ విజయంపై హర్షం వ్యక్తం చేశారు. సహా కార్యదర్శి ధాత్రిక రమేష్, హిందు వాహిని లక్ష్మంజి, నగర అధ్యక్షుడు శ్రీకాంత్ సనాతన, బినయ్, అర్జున్ రెడ్డి, ప్రణయ్, రాంప్రసాద్ చెటర్జీ, నరేష్ గౌడ్, శైలేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు



హిందూవాహిని ఆధ్వర్యంలో..



ర్యాలీలో బీజేపీ జెండాను ఊపుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

నిజామాబాద్ రూరల్ హస్తగతం

- ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి గెలుపు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై 21,963 ఓట్ల మెజార్టీ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి విజయం సాధించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ బాలుర కళాశాలలో ఆదివారం ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మొత్తం 21 రౌండ్లు సాగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే తన సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై భూపతిరెడ్డి పూర్తి ఆధిక్యం ప్రదర్శించి 21,963 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కేవలం 8వ రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి 556 స్వల్ప మెజార్టీ సాధించారు. అలాగే 10వ రౌండ్‌లో బీజేపీ అభ్యర్థి కులాచారి దినేష్‌కుమార్ 181 ఓట్ల స్వల్ప మెజార్టీ సాధించారు. మిగిలిన అన్ని రౌండ్లలో బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులపై కాంగ్రెస్ అభ్యర్థి స్పష్టమైన మెజార్టీ సాధించారు.

బీజేపీకి పెరిగిన ఓటింగ్ శాతం..

రూరల్ నియోజకవర్గంలో మొత్తం 293 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,53,233 ఓట్లకు గానూ 1,93,510 ఓట్లు పోలయ్యాయి. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1714 ఓట్లు ఉండగా అందులో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 313 ఓట్లు, బీజేపీ అభ్యర్థికి 455 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 655 ఓట్లు వచ్చాయి. ఈవీఎంలలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి 78,378 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ 56,415 ఓట్లు, బీజేపీ అభ్యర్థి కులాచారి దినేష్‌కుమార్ 49,723 ఓట్లు సాధించారు. ముఖ్యంగా బీజేపీ అభ్యర్థి దినేష్‌కుమార్ అనూహ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాజిరెడ్డికి ధీటుగా సుమారు 50వేల ఓట్లు సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నిజామాబాద్ రూరల్ బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మొత్తం 14 మంది పోటీలో ఉన్నారు. వీరిలో బీఎస్పీ అభ్యర్థి మటంల శేఖర్ 2,261 ఓట్లు సాధించగా, నోటాకు 2,254 ఓట్లు వచ్చాయి.

15ఏళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్..

డిచ్‌పల్లి నియోజకవర్గంలో 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల లలిత తన సమీప ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి మండవ వెంకటేశ్వరరావుపై విజయం సాధించిన విషయం తెలిసిందే. అనంతరం 2009లో డిచ్‌పల్లి నియోజకవర్గం నిజామాబాద్ రూరల్‌గా మారింది. 2009లో జరిగిన ఎన్నికల్లో మండవ వెంకటేశ్వరరావు తిరిగి ఆకుల లలితపై విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విజయం సాధించారు. ఇప్పుడు 15ఏళ్ల తర్వాత 2023లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి విజయం సాధించారు.



సిరికొండలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



పడకల్ గ్రామంలో..



సిరికొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

సిరికొండ/జక్రాన్‌పల్లి/నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించడంతో పార్టీ శ్రేణులు విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రూరల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, నృత్యాలు చేస్తు సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి ప్రజలను, నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగి వేసారిపోయారని పేర్కొన్నారు. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధినేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలకు రుణపడి ఉంటానని అన్నారు. రూరల్ నియోజకవర్గ ప్రజలు తనకు ఇచ్చిన ఎమ్మెల్యే బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వహించి సబ్బండవర్గాలకు న్యాయం చేస్తానన్నారు. సంక్షేమ పథకాల్లో సామాజిక న్యాయం పాటించి, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని వివరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు రూరల్ ప్రజలకు రుణపడి ఉంటానని రెండు చేతులు జోడించి నమస్కరించారు. సిరికొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ.. పార్టీ విజయానికి కృషి చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరి సమిష్టి కృషి వల్ల కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిందన్నారు. కాంగ్రెస్ నాయకులు బాకారం సంతోష్, కుందేళ్ల శ్రీనివాస్, సురేష్ తదితరులు ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2 యానిమల్(హిందీ) 9.30
యానిమల్(తెలుగు) 1.15
సామ్ బహదూర్(హిందీ) 5.00, 7.50, 10.40

స్క్రీన్-3 యానిమల్(హిందీ) 11.10, 3.00, 10.30
యానిమల్(తెలుగు) 6.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 యానిమల్(తెలుగు,9.00,1.00, 5.00, 9.00

స్క్రీన్-2 యానిమల్(హిందీ) 10.00,2.00, 6.00, 10.00

స్క్రీన్-3 సామ్ బహదూర్(హిందీ) 12.40, 3.50, 7.00, 10.10

స్క్రీన్-4 పల్లె గూటికి పండుగొచ్చింది(తెలుగు), 10.00
అద్దా(తెలుగు) 3.50
సహస్ర(తెలుగు) 6.40
రాథోడ్(తెలుగు) 9.45

దేవి ఆదికేశవ(తెలుగు)
నటరాజ్ అథర్వ(తెలుగు)
లలితామహల్ యానిమల్(తెలుగు)
విజయ్ యానిమల్(హిందీ)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్ 63,000 వెండి (కిలో) 79,200
22 క్యారెట్స్ 58,182 - నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్ 180
		లైవ్ 160
స్కిన్‌లెస్	240	మటన్ 750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	గాజరుగడ్డ	40	60
బెండకాయ	25	40	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	16	30
బిర్నీసకాయ	50	70	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	60	గోబిపువ్వు	15	30
వంకాయ	10	20	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	20	40
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

ప్రజలు మార్పు కోరుకున్నారు

నిజామాబాద్ రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఒంటెద్దు పోకడతో ప్రజలు మార్పు కోరుకున్నారని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అభిప్రాయ పడ్డారు. రూరల్ మండలంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద గల రూరల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామికంగా నిష్పక్షపాతంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడం సంతోషకరంగా ఉందని అన్నారు. అమలు కాని హామీలను ప్రకటిస్తూ, సంక్షేమ పథకాల అమలులో అవినీతికి పాల్పడటంతో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి తప్పలేదని అన్నారు. ప్రస్తుతం రంగుల, ఆచరణ, ఊహ ప్రపంచంలో తెలియాడుతున్న ప్రజలకు నిష్పక్షపాతమైన రాజకీయ నాయకులు దొరకడం లేదని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒకటే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించ గలదని పేర్కొన్నారు. అనంతరం రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గెలుపొందిన రేకులపల్లి భూపతిరెడ్డికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండవ వెంకటేశ్వరరావు

ఘనంగా పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కుల సంఘ సభ్యుల సమక్షంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి, అమ్మవారికి సమర్పించారు. అనంతరం పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గన్నారంలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ప్రజలు

ధ్రువపత్రాల అందజేత

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయింది. గెలిచిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. అర్బన్ నుంచి ధన్‌పాల్‌తోపాటు ఆయా నియోజకవర్గాల నుంచి విజేతలు ధ్రువపత్రాలను అందుకున్నారు.



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న అర్బన్ బీజేపీ అభ్యర్థి ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా



రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి



బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి తరఫున పార్టీ నేతలు



బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి



ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి